# వారసుడు

ఆ పెట్టెలో జనం కిటకిటలాడుతున్నారు. ఆ కొస నుంచి యీ కొస దాకా చూసాడు కాని, బాబుగారు కూర్చోడానికి ఎక్కడా చోటు దొరకలేదు అప్పలసామికి. నలుగురు కూర్చోవలసిన బెంచీ మీద ఆరుగురు, ఏడుగురు కూర్చున్నారు

"మా బాబుగారికి కూసింత సోటియ్యండి బాబూ" అన్నాడు అప్పలసామి అర్థింపుగా.

ఆ బాబూగారనబడే వెంకటరెడ్డి ఒకసారి అందరి మొహాల్లోకీ చూసాడు.

ఎవరూ చోటిచ్చి పుణ్యం కట్టుకోలేదు.

"ఒరే కొండా, నువు కింద కూకుని, ఆ బాబుగారికి సోటియ్యరా" అన్నాడు కళ్ళజోడెట్టుకున్న ముసిలాడు.

"మూడుంబావలా పెట్టి టికెట్టు కొనుక్కున్నాను. నా నెందుకు కూసోవాల కింద." అన్నాడు కోపంగా కొండయ్య బిగదీసుక్కూచుని.

"కొన్నావులేరా మూడుంబావలా ఎట్టి పెద్దోళ్ళంటే బయంబత్తి వుంటొద్దేటి?" అని కసిరి, ఎదురుగా కూచున్న కొండయ్య రెండు చేతులూ పట్టి లాగాడు ఆ ముసలాడు — క్రింద కూచోమని! అప్పలసామి కొండయ్యను ఒడుపుగా సీటులోంచి బయటకు లాగి కింద కూర్చోపెట్టేశాడు.

"యిమానంలో ఎల్లాల్సిన మారాజు యీ బండిలో ఎడతన్నారండి. అర్జెంటుగా రమ్మని మినుష్ట్రునుంచి పిలుపొస్తే అయిదరాబాదు ఎలతన్నారండి" అని ఆ బాబును అక్కడ కూచున్న వాళ్ళకందరికీ పరిచయం చేసి "కూకోండి బాబూ, కూకోండి" అని కొండయ్య ఖాళీ చేసిన చోటును తువ్వాలుతో తుడిచాడు అప్పలసామి.

ఆ బాబుగారు ఠీవిగా కూర్చుని, ఒకసారి అందరి వంకా చూసాడు.

"యిదేమన్నా దరమంగా వుందా? నాను ముందొచ్చి బెంచీ మీద కూకుంటే మీరెనకాలొచ్చి నన్ను కింద కీడ్చేత్తారా? నాను టికెట్టు కొనుక్కోలేదేటి?" అని సణిగాడు కొండయ్య.

"కొన్నావులేరా ఎదవ టికెట్టు— యింతోటి మొకానికి యీ సేబులం పనుపా అని సీటా బెంచీ కావాలేటి?" అని కసిరాడు ముసిలాడు

బాబుగారు జేబులోంచి చుట్ట తీసి, ఓటి ముసలాడికి, ఓటి అప్పలసామికీ యిచ్చాడు.

"బాబుగారు యిన్ని గింజలు చల్లితే యేరుకోవాల్సిన వాళ్ళం మనం, పెద్దంత్రం సిన్నంత్రం లేకుండా యేటి నీ సణుగుడు? కూకో, అలాకింద కూకో.'' అని గదమా

సి. సత్యనారాయణ

యించాడు అప్పలసామి చుట్ట నోట్లో పెట్టుకుంటూ.

ఆ బెంచీలమీద కూచున్న మిగతా వాళ్ళంతా, ఎవరికీ యేమీ పట్టనట్లుగా డ్రామా చూస్తున్నట్లు చూస్తున్నారు.

"యిది దవుర్జెన్నం బాబూ! మీవూరికి మీరు మారాజులు కావచ్చు. అయితే నాకేటి? నానెందుకు కింద కూకోవాలి?"

వాడి సణుగుడికి ముసిలాడు తాటాకు మంటలా లేచాడు.


"ఏటిరా నీ యేడుపు? నువు పుట్టిం దగ్గర్నుంచీ సోఫాల మీద, పట్టు పరుపుల మీదా పెరిగేవుట్రా—కింద కూకోడానికి వలవలా యేడిసేత్తన్నావు' అలా కింద కూకో—ఓరన్నా దిగిపోతే కూకుందువు గానిలే." అన్నాడు కోపంగా.

అప్పలసామి ఛర్రున లేచాడు "ఆ బాబు లచ్చాధికారి. నువ్వేమో ఫకీరు వెదవ్వి. ఆ బాబుగారి కుక్కలికి కాళ్ళు పట్టడానికక్కూడా పనికి రానోడివి ఆ బాబుతో సమంగా బెంచీ మీదకూకుంటా వేటి? కూకో—అలా కిందకూకో. ఆడికో సుట్టముక్క పారెయ్యండి బాబూ ఏడుత్తన్నాడు." అని అరిచాడు కోపంగా.

ఆ మాటలు కొండయ్యకు ఛెళ్ళున తగిలాయి

"దరమం వుండాలి బాబూ, దరమం. డబ్బుంటే సరిపోద్దేటి? ఎదవ డబ్బు! ఆడ ముండా సంపాయిద్ది, యీది కుక్కా సంపాయిద్ది. సీ-వెదవ డబ్బు! ఏటి రంగన్నా తాతా, అలా సూత్తా వున్నావు-దరమం సెప్పు—నానిలా కింద కూసోవాలా?" అన్నాడు కోపంగా.

అప్పుడే చలనం వచ్చిన



మనిషిలా కదిలాడు రంగన్న తాత. తన ప్రక్కనకూచున్న ఆ బాబుగారినీ, ఎదురుగా కూచున్న కళ్ళజోడు ముసిలాణ్ణి, అప్పల సామినీ ఒకసారి చూసి, కొండయ్యి మీద విరుచుకు పడ్డాడు.

"ఒరేయ్ నువ్వు మనుషుల్ని తిట్టు. దులిపేసుకుంటారు. కాని డబ్బును తిట్టకు. డబ్బంటే యేటనుకున్నావొరే? లచ్చిమీ దేవి—మహాలచ్చిమీ దేవి. లెంపలేసుకుని లచ్చిందేవికి దణ్ణం పెట్టుకో! ఆయమ్మ నీకాడుంటే యీ రైలుబండే కొనీయొచ్చు. రైల్లో మనుసుల్నీ కొనీయొచ్చు. మీ వూరి పెసిడెంటవ్వచ్చు. యమ్మెల్లే అవ్వొచ్చు. మినుష్టు అవ్వొచ్చు. సభలెట్టెచ్చు. సమ్మానాలు చేయించుకోవచ్చు. బుర్ర లిత్తీయొచ్చు. బుర్రలు మార్చొచ్చు. ఆ డబ్బుమహత్తిం అంతా యింతా అనుకున్నావేటి?

నీకే డబ్బు నేకపోతే నీ పెళ్ళాం అవతలీది కాబూలీ వోడితో లేచిపోద్ది. నీకూతురు వూరంతకీ మరదలవుద్ది. నీ కొడుకు నీపీక కోరికేసి నీ శవాన్ని మెడికల్ కాలేజీ కమ్మేత్తాడు. డబ్బంటే యేటనుకున్నావ్?

నీకు డబ్బున్నప్పుడు చచ్చిపోతే గంధం చెక్కల్తో తగలేత్తారు.

నీకు డబ్బు లేనప్పుడు చచ్చిపోతే మునిసిపాలిటీ బండిలో తోసేత్తారు.

నీకు డబ్బిలవ తెలవకపోతే మా నాయుడు బాబుగోరి నడుగు. మా సుక్కమ్మగోరి నడుగు. రాధమ్మగోరి నడుగు. ఆ యమ్మ బాబుగోరి నడుగు. అంతేకాని ఎదవ డబ్బని తిట్టమాకు!" అని వూపిరి పీల్చుకున్నాడు.

"మీ నాయుడి బాబంటే ఎవరు తాతా?"

"అలాగడుగు సెప్తాను."

* * *

నాయుడు బాబంటే మా వూరి పంచాయితీ పెసిడెంటు. సినీమాహాలు పొప్పురేటరు. పెంకులమిల్లు పొప్పురేటరు. రైసుమిల్లు ఓనరు. లారీ అస్సోసియేషను పెసిడెంటు.

ఆ బాబుకి ఆత్తి ఎంతనుకున్నావేటి?

ఆళ్ళ బాబిచ్చింది అయిదెకరాలు. అటు పక్క పదెకరాలూ, యిటుపక్క పదెకరాలూ కలుపుకుని పాతికెకరాలు సేసేడు. ఎండి గిన్నెల్లో ఏడంబలి తాగి యేభై ఎకరాలు సేసేడు. సినీమాహాలు కట్టి దాన్ని వందెకరాలు అయిందనిపించాడు. పంచాయితీ పెసిడెంటయిం తర్వాత ఇంకో రెండింతలు సేసీడు. ఈ గట్టుమీద కొబ్బరి పిట్టెక్కి సూత్తే అవతలి గట్టు కనిపించకుండా పెంచేడు.


ఊళ్ళో సినీమాహాలు కట్టేడు. పెంకుల మిల్లు కట్టేడు. సగ్గు బియ్యం పేక్టరీ కట్టేడు. నన్నేటి సెప్పమంటా వొరే—వూరంతా ఆ బాబుదే.

ఆ బాబు బంగళా ఎలాగుంటుందనుకున్నావేటి?

సినీమాల్లో సూపిత్తారు సూడు—రాజదర్బారు లాగుంటది! బారతంలో సెప్తారు సూడు—మయసబలాగుంటది! ఇల్లంతా ఏర్ కండీసను.

మరి ఆ బాబు పలుకుబడీ ఎలాంటిదనుకున్నావ్?

మా వూళ్ళో ఆ బాబు సెప్పింది ఏదం! పొలం తగువులూ ఆ బాబే తీర్చాల, ఇంటి తగువులూ ఆ బాబే తీర్చాల! నిన్ను కొన్ని




లర్ని సేయాలన్నా. ఖూనీకోర్ని సెయ్యా లన్నా ఆ బాబే సెయ్యాల. నడీధిలో నలుగుర్ని పొడిసేసి, ఆ బాబు కాళ్ళట్టుకో— మరి కేసుండదు. దొంగనోట్లచ్చేసి దొరికిపోయావనుకో! ఆ బాబు కాళ్ళట్టుకో— నీకేం బయంలేదు.

అల్లాంటి—అంత ఆత్తీ, పలుకుబడీ వున్న బాబుకి-మనోయా దట్టుకుంది-ఇంత ఆత్తీ సంపాయించాను గందా, ఇంత పలుకుబడీ వుంది గందా, ఈటన్నిటికీ నా తరవాత ఓరసులెవరూ అని?

ఆ బాబుకు యాభయ్యేళ్ళొచ్చేయి కాని, ఒక్క నలుసుకూడా నేదు.

ఓరసుల్లేకపోతే, ఆత్తంతా పెబుత్వం పట్టుకుపోద్దని ఆ బాబుతో ఎవరో సెప్పారు.

ఆ రేత్తిరినుంచీ ఇంక నిద్దరపట్టలేదు.

ఇంత కట్టపడి, ఇంత మందినీ దోచి, ఇన్నన్యాయాలు సేసి ఇంతాత్తీ సంపాయించింది పెబుత్వం ఎదాన కొట్టడానికా అని గింజుకున్నాడు.

ఆ బాబుకి అన్నం సయించలేదు.

పెళ్ళయి ముప్పయ్యేళ్ళయినా ఒక్క పిల్లాణ్ణయినా కననందుకు పెళ్ళాంమీద కోపమొచ్చింది. ఆ కోపంతో పెళ్ళాన్ని తిట్టేడు. "యింక నీకు పిల్లలు పుట్టరేటి సెంద్రం?" అని ఇసుక్కున్నాడు.


ఇసుగెక్కపై "ఇదిగో సెంద్రం, యిదే ఆఖరిమాట సెప్తున్నాను. నీకు మూణ్ణెళ్ళు టయిమిత్తున్నాను. నువు పిల్లోణ్ణెత్తుకోపోతే నేనింకో పెళ్ళి సేసుకుంటాను." అన్నాడు ఖరాఖండీగా ఓరోజు.

ఆ యమ్మ లబోదిబో మంది కాని, ఆ బాబు ఇనుకోలేదు.

నాయుడు బాబిలా రెండోపెళ్ళి సేసుకుంటాడన్న యిసయం ఎలా పొక్కిపోయిందో కాని, వూరంతా తెలిసిపోయింది. మా అమ్మాయిని సేసుకొమ్మంటే మా అమ్మాయిని సేసుకొమ్మని ఆ చుట్టుపక్కల వూళ్ళనుంచి జనం తిరణాళ్ళగా వచ్చేరు.

"ఆ బాబుని గుండెజబ్బలా తినేసింది కాని, ముసలోడా, ముతకోడా! బుగ్గన చుక్క, మొహాన బొట్టూ పెడితే పెళ్ళికొడుకు నాగుంటాడు. ఆ బాబు కిట్టమైతే, మా రెండోదాన్ని సేసుకోమను." అని కబురంపిన తల్లులున్నారు.

"మా పెద్దమ్మాయిని మీరు సూసే వుంటారు బాబూ, దీపం నాగుంటది. పొలంకెడదావని బయల్దేరతావుంటే,తలుపు



చాటున్నుంచుని సిగ్గుపడి పోతుందండీ అమ్మాయి. "యేటే సెప్పు" అన్నానండీ "నేన్నాయుడు బాబును పెళ్ళిసేసుకుంటా న్నానాన్న" అని సెప్పి వాళ్ళమ్మదగ్గరికి పారి పోయిందండి దానికి మీరంటే ఎంత పేమో, ఎంత అభిమానమో!" అని తెలివిగా సెప్పిన తండ్రులున్నారు

నాయుడు బాబు అన్నీయిన్నాడు. యిని మూణ్ణెళ్ళ తరవాత అందరి సంగతీ సూత్తానని సెప్పాడు.

బస్తీలో నాయుడు బాబుకో మరదలుంది. పేరు సుక్కమ్మ. మరదలంటే ఓరనుకున్నావ్? సొయాన తమ్ముడి పెళ్ళాం వన్నమాట బావగారిలా మళ్ళీ పెళ్ళిసేసుకుంటున్నాడన్న సంగతి ఇని నమ్మలేక పోయింది. మనిసిని పంపించి ఇసయాలేమిటో తెలుసుకోమంది. తెలుసుకున్న తరవాత ఆ యమ్మకింక కళ్ళూ సేతులూ ఆడలేదు. ఆరేతిరి నిద్దరట్టలేదు. సిన్నప్పటి సంగతులన్నీ గేపకం ఒచ్చేయి

అప్పుడు సుక్కమ్మకు పదేనేళ్ళు, సెంద్రమ్మకు పదారేళ్ళు వుండేయి కూతుళ్ళిద్దరికీ ఒపాలే పెళ్ళిసేద్దామని ఆళ్ళబాబు దేశమంతా తిరిగి యిద్దరన్నదమ్ముల్ని సూసేడు పెద్దల్లుడి మొహంలో కుబేరుడి కళలున్నాయని, చిన్నల్లుడి మొహంమీద బుహస్పతి గీతలున్నాయని మురిసిపోయా వోడు ఆ తండ్రి.

ఆ కుబేరుడి కళలున్నాయన పేర్నాయుడు—మన నాయుడుబాబు.

ఆ బుహస్పతి గీతలున్నాయన సిన్నారావు—నాయుడుబాబు తమ్ముడు.

ఆళ్ళిద్దర్నీ పెళ్ళి సూపులకి పిలిసి, కూతుళ్ళిద్దర్నీ సాపమీద కూచోపెట్టేడు తండ్రి.


సుక్కమ్మ సూపులన్నీ నాయుడుబాబు మీదేవున్నాయి. నాయుడు సన్నని లాల్చీ తొడుక్కుని పంచెకట్టేడు. సేతికున్న రెండుంగరాలూ, మెళ్ళో పులిగోరూ ధగధగ మెరుస్తున్నాయి. కుర్చీలో దర్జాగా కూచుంటే సివాసనం మీద దేవేంద్రుడు కూచున్నట్టుంది. ఆ బాబు మొహంలో దేశాన్నేలే జాతకం సుక్కమ్మకి కనిపించింది. "మొగాడంటే ఇలాగుండాల దర్జాగ." అనుకుంది


సెంద్రమ్మ మనసంతా సిన్నారావు మీదుంది ఆ బాబు పేంటూ, చొక్కా యేసుకుని బూటు తొడుక్కున్నాడు తల నున్నగా దువ్వుకుని బుద్దిగా కుర్చీలోకూచున్నాడు. ఆ బాబు మొహంలో సీరామచంద్రుడు కనిపించేడు సెంద్రమ్మకి. "యీ సినబాబు నన్నుసేసుకుంటే సిఁవాచలం కొండకొత్తాను" అని మొక్కుకుంది.

పెళ్ళిసూపులయింతర్వాత అన్నదమ్ములిద్దరూ ఎళ్ళిపోయారు.

"నేన్నాయుడు బావను సేసుకుంటా న్నానాన్న" అని సెప్పింది సుక్కమ్మ.

తండ్రి అదిరిపడ్డాడు. "సీ—సీ—ఎదవ మాటలూ, నువ్వూను! సెంద్రికీ, పెద





బాబుకీ జత. నువ్వూ, సినబాబూ సిలకా గోరింకల్లాగుంటారు" అన్నాడు

"ఆ సిన్నారావూ, సన్నాసిరావూ నా కక్కర్లేదు. నేన్నాయుడు బావనే సేసుకుంటాను" అని మారాం సేసింది సుక్కమ్మ.

ఆ తండ్రికి మతిపోయింది. కూతురికి ఎలా నచ్చచెప్పాలో తేలలేదు "ఆ పెద బాబులో ఏముంది పల్లెటూరి సన్నాసి' సదుగూ, సామూ యేటీలేవు యవసాయం సేసుకుంటూ వూళ్ళోనే వుంటాడు. సిన బాబు సూడు, బస్తీలో సదూకున్నాడు. రేపో మాపో వుజ్జోగం వచ్చిందంటే బస్తీలో కాపరం యెడతాడు నిన్ను కార్ల మీద, యిమానాలమీదా తిప్పుతాడు." అన్నాడు తండ్రి

తండ్రి అమాయకత్వానికి కూతురు నవ్వింది. "నీకు బుర్రలేదు నాన్నా' సదూకొని వుజ్జోగం సేస్తే ముష్టిపడేసినట్లు మూడొందలిస్తారు. అదే యవసాయం సేసుకుంటే మూడేళ్ళలో ముప్పయ్యేలు ఎనకేసుకోవచ్చు ఇనకం టాక్సు ఓళ్ళు కూడా జెల్లకొట్టీయొచ్చు." అంది


కూతురి తెలివి తేటలకి ఆ తండ్రి ఆచ్చెరిపోయాడు. ఆడదానికిన్ని తెలివితేటలేంటని కోపమొచ్చింది. ఒచ్చి, యెంటనే ముహూర్తాలు పెట్టేశాడు.

సెంద్రమ్మని నాయుడుబాబు పెళ్ళిసేసుకున్నాడు.

సుక్కమ్మని సిన్నారావుసేసుకున్నాడు.

ఆ తరవాత సిన్నారావు కుజ్జోగమొచ్చి బస్తీలో కాపరంపెట్టాడు.ఆ బాబుకు తాలూకాపీసులో పని. జీతం మూడొందలుకాని, తెలివుంటే వూరంతా నొళ్ళేసుకునే వుజ్జోగమంట. యీ బాబేమో అరిచ్చెంద్రుడు లాటోడు. పెళ్ళానన్నా అమ్మేత్తాను కాని, లంచంపట్టను అనీవోడు. జీతం మూడొందలూ యేటికి సరిపోతయ్యి. ఆ సుక్కమ్మ సీరలకీ, సోకులకీ సరిపోయీవి కావన్న మాట.

సంకురేతిరికి, ఇద్దరక్కసెల్లెళ్ళు మొగుళ్ళను తీస్కుని అమ్మగారింటికొచ్చేరు. సెంద్రమ్మ మెళ్ళో నాలుగుపేటల గొలుసు సూసింది సుక్కమ్మ. మొగుడికి సూపించి తనకూ సేయించమంది మళ్ళీ సంకురేతిరికి నెక్లేసు సూసింది సూసినెంటనే శివమెత్తిపోయి మొగుణ్ణి తిట్టింది "నాయుడు బావ మా సెంద్రానికి సేయించిన నెక్లేసు సూసేవా? మొగుడంటే అలాగుండాలి. నువ్వూ వున్నావు-జమాజెట్టీలా ఎందుకు?"



అంది. ఆ మళ్ళీ సంకురేతిరికి దండ వంకీ లూచసింది సూసి ఎర్రెక్కిపోయింది. "ఎదవ సదువు సదివి, సన్నాసుజ్జోగం సేసుకునీవోడికి నీకు పెళ్ళామెందుకు? నా మెళ్ళో తాళికట్టి నా గొంతు కోసావ్." అని యేడ్చింది.

ఇలా పదేళ్ళు నా కది సేయించు, ఇది సేయించని ఆ బాబు పేనాలు తోడేసింది. ఆ బాబు ఈటన్నిటికీ తట్టుకోలేక దొరికిన సోటల్లా అప్పులేచ్చేసేడు. వడ్డీతో ఒడిగుర్రాలన్నా పరుగెత్తలేవంటారు. అల్లాగ ఆ బాబు జీతమంతా వడ్డీకి సరిపోయేది. జీతం తెస్తేనేగాని తిండెట్టననేది సుక్కమ్మ. ఇంక ఆ బాబు పేనం యిసికిపోయి అన్నయ్యదగ్గిరికెళ్ళి ఆస్తి పంచమన్నాడు. తన వాటా అమ్మేసి అప్పు తీర్చుకుంటానన్నాడు

అప్పుడు నాయుడుబాబు యేటన్నాడనుకున్నావ్?

"అయ్య చచ్చినాటికి మనకి ఆస్తీపాస్తీ యేటున్నాయి. ఉన్న డబ్బంతా నీ సదువుకే తగిలేశాడు. నువు పంచుకుంటానంటే, అయ్య సేసిన అప్పులింకా వున్నాయి" అన్నాడు.

ఆ బాబుకేటీ దారి గనిపించలేదు. ఇంటికొచ్చేసి పెళ్ళాన్ని తిట్టేడు. "నీ సీరలకీ, సోకులకీ అప్పుల్జేసేను. నీ మెళ్ళో బంగారం ఇచ్చేయి—అప్పు తీరుత్తాను." అన్నాడు. బంగారం ఇమ్మనేప్పటికి ఆ యమ్మ తాసుపాములా లేసింది. "యియ్యాల పెళ్ళాం మెళ్ళో బంగారం అమ్ముతానన్నావు. రేపు పెళ్ళాన్నే అమ్ముతానంటావు. సిగ్గూ, శరమూ లేదేటి?" అని తిట్టింది. అసలే అప్పుల్లో వున్నాడేమో, ఆ బాబుకు తిక్కకోపంవచ్చేసి, ఆ బంగారం ఇయ్యకపోతే పొడిచేత్తానన్నాడు.

ఆ రాత్రి పడుకున్న సినబాబు పొద్దున్న లేవలేదు. "నన్ను అన్నేయంసేసి పోయినోవు దేవుడో" అని సుక్కమ్మ గోలు గోలున యేడిసింది. "సుక్కమ్మే మొగుడికి మందెట్టి సంపేసింది—యీయన్నీ దొంగేడుపులు" అన్నారు కొంతమంది. "అప్పులబాధ భరించలేక మందు మింగిసేడు" అన్నారు కొంతమంది. ఏటి నిజమో ఆ పాపం-పున్నెం మనకు తెలీదు?

ఆ తరవాత "సేవలేని మొగుడు వుంటేనేం, పోతేనేం?" అని సరిపెట్టుకుంది. పదికాసుల బంగారం అమ్మేసి ఒడ్డీ యాపారం ఎట్టుకుంది. అయిదేళ్ళలో ఇల్లు కట్టుకుంది.

ఆ ఇంటి పక్కనో డాక్టరుబాబుండేవోడు, పేరు యిసినాదం. ఆ బాబు వైద్యం చేత్తానంటే జనం ఒచ్చేవోరు కాదు. అందుకని మందులసాపు ఎట్టుకున్నాడు. ఆ సాపులో సుక్కమ్మ మందులు కొనుక్కునేది. ఆ బాబు సుక్కమ్మదగ్గిర డబ్బు తీసుకునేవోడు ఒడ్డీకి. ఆ యిదంగా ఆళ్ళిద్దరికీ కలిసింది.

పదేళ్ళనుంచీ సుక్కమ్మింటికి ఒస్తూ, పోతూ వుంటాడు యిసినాదంబాబు.

ఈ సంగతులన్నీ గేపకం ఒచ్చేయన్న మాట సుక్కమ్మకి.

గేపకం ఒచ్చి కళ్ళంట నీళ్ళొచ్చేయి. "అప్పుడే నాయుడుబావను సేసుకుంటే మహారాణీలాగుండేదాన్ని గదా." అనుకుంది.

ఆ రేత్తిరి ఇంక నిద్దరట్టలేదు

తాటిచెట్టునీడ నీడాకాదు, తగులుకున్న మొగుడు మొగుడూ కాదు అనుకుంది

యిసినాదం బాబుకేటీ అర్ధంకాలేదు. "యియ్యాల నిద్దరావడం లేదేమిటే సుక్కా" అన్నాడు.

సుక్కమ్మ పక్కమీద లేచి కూచుంది. కూచుని యిసినాదం బాబు కళ్ళల్లోకి సూసి "నీకు మళ్ళీ జనమలో రుణం తీర్సుగుంటా కానీ, నాకో సాయం సేత్తివా మావా?" అంది.

"అద్దరేత్రికాడ సాయాలేటే పడుకో." అని కసిరాడు ఆ బాబు.

"నాకు నెలతప్పకుండా యిచ్చేవోడివి, అలాంటి మాత్రలు ఓ సీసాడు కావాలి. అరిజెంటుగా తెచ్చిపెట్టు." అంది. ఆబాబు మందుల సాపుకెళ్ళి, మాత్రలు తెచ్చేటప్పటికి, సుక్కమ్మ పెట్టె సర్దీసుకుంది. సీసా పెట్టెలో పెట్టుకుని అసలు సంగజ్జెప్పింది. "మా అక్కకు ఒంట్లో బాగోలేదంట! నేనూరెల్లి ఒత్తాను. ఇల్లూ, యాపారంబాగా సూడు. నేను లేనని బెంగపడీపోకు. మరి నన్ను బస్సెక్కించు." అంది.

ఆ బాబు ఎర్రిమొహం యేసుకుని సూత్తుండగానే, పెట్టె పట్టుకుని గడప దాటింది సుక్కమ్మ.

సుక్కమ్మ నాయుడింట్లో అడుగుపెడుతూనే ఏడుపు లంకించుకుంది. "నీకెన్ని కష్టాలొచ్చేయే సెంద్రీ, బావ మళ్ళీ పెళ్ళి సేసుకుంటే నీ బతుకేమయిపోద్దే సెంద్రీ! సింహాచలం కొండమీద సివాద్రప్పన్న వున్నాడు. అన్నవరం కొండమీద సత్తిన్నారాయణ మూర్తున్నాడు, ఏడుకొండల మీద ఎంకన్న బాబున్నాడు, ఏ బాబూ నీకు పిల్లోణివ్వలేదా?" అని యేడిసింది.

సెల్లిలి పేమకి అక్కకీ యేడుపొచ్చేసి సెల్లిల్ని కావలించుకుంది. కాస్సేపు యేడిసి "ఎలా జరిగేదుంటే అలా జరుగుద్ది. బగమంతుడు ఆయిధంగా గీత గీస్తే అనుభవించక తప్పుద్దా. యీమూడు నెల్లూ ఎలా గడుత్తాయో, యేటో!" అని యేదాంతం మాట్టాడింది.

"నువ్వేటీ బయపడకే సెంద్రీ! నిన్నొదిలేసి దేన్ని కట్టుకుంటాడో సూద్దాం. అయికోర్టు కీడిపించి సీస్సీ అనిపిత్తాను. సుప్పిరీం కోర్టు కెల్లయినా నీ కాపరం నిలబెడతా సూడు." అంది. "నువ్విలా బెంగెట్టేసుకుని మంచాన పడిపోతే లాబం లేదు సూడు ఆ కళ్ళు ఎలా లోతుకు పోయాయో పాలూ, పళ్ళూ తీసుకుని బలంగా వుండాల" అని దైర్యం చెప్పింది.

పెతీ రోజూ పడుకోబోయే ముందు గ్లాసుడు పాలల్లో ఓ మాత్ర కలిపి అక్కతో తాగించేది. సెల్లెలి పేమకి సెంద్రమ్మ మనసు సెరువై పోయింది. "నేనంటే ఎంత పేమే సెల్లీ" అని కావిలించుకుని యేడిసీది ఆ ఎర్రి మొహం.

నాయుడు బాబిచ్చిన గడువు రోజులు దగ్గిర కొచ్చీ కొద్దీ సెంద్రమ్మకి కాళ్ళూ, సేతులూ ఆడేవి కావు. సెల్లి చెప్పినట్లు అయికోర్టు కెళ్ళయినా కాపరం నిలబెట్టుకో వాలనుకుంది "గంగలో ముంచినా, గోదార్లో ముంచినా నువ్వే ముంచవే సుక్కా అని సెప్పి తాళం చెవు లిచ్చేసింది." ఎదవ డబ్బుపోతే ఎప్పుడేనా సంపాయించుకోవచ్చు కాపరం పోతే మళ్ళీ నిలబడుద్దేటి॰ బస్తీలో మంచి వకీల్నెట్టు" అంది.

సెంద్రమ్మ యింత తొందరగా లొంగి పోద్దని ఆయమ్మ అనుకోలేదు. సేతి కింత తొందరగా తాళాలొచ్చినందుకు అచ్చెరిపోయింది

నాయుడు బాబుకీ మరదల్ని సూడగానే మతి చలించింది. ఎప్పుడో ముప్పయ్యేళ్ళ క్రితం పెళ్ళి సూపుల రోజులు మళ్ళీ గేపకం ఒచ్చేయి. అప్పుడెలాగుందో పెళ్ళికూతుర్లాగ, యిప్పుడూ అలాగేవుంది' వయసొచ్చి ఒళ్ళు సేసింది కాని సుక్కమ్మ కేటి॰

తెల్లచీర కట్టుకుంటే ఎదవ ముండ గాని, రంగు చీర కట్టుకుంటే సినిమా తారలాగుంటుంది.

ఆ రాత్రి నాయుడు బాబు కలలోకి సిలుకు సీర కట్టుకుని సుక్కమ్మొచ్చింది. ఒంటి నిండా బంగారం, బస్తీలో డాబా ఆ బాబు కళ్ళని జిగేళ్మనిపించేయి

"ఓరసుల్లేరని మళ్ళీ పెళ్ళి సేసు కుంటానంటే వందల కొద్దీ ఒచ్చేరు పిల్ల నిత్తామని' ఓ తులం బంగారం పెడతా మని గాని, ఓ వెయ్యి రూపాయలు కట్నం యిత్తామనిగాని ఓరైనా అన్నారా॰ పిల్ల నిచ్చి ఆత్తి కాజేద్దామని' గుంటనక్కల జిత్తులుగాని! పిలిత్తే లచ్చిమి దేవిలా ఒత్తాది సుక్కమ్మ. బంగారం వుంది. ఒడ్డీ యాపారం వుంది, బస్తీలో డాబా వుంది. సిలుకు సీర కట్టుకుంటే సీమహా లచ్చిమిలాగుంటది. యింకేటి కావాల॰" అనుకున్నాడు నాయుడు బాబు.

సుక్కమ్మకీ నిద్దరట్టలేదు. సిలుకు లాల్చీ తొడుక్కుని కల్లోకొచ్చీ వోడు నాయుడు బాబు. ఆ బాబు సుట్టూ సినీమా హాళ్ళూ, సగ్గుబియ్యం పేక్టరీలు వుండీయి. లాల్చీ జేబుల్లో ఒంద రూపాయల నోట్లూ చెక్కు బుక్కులూ వుండేవి

నూకలు సల్లి గుర్రంలాంటి కోడి పుంజునైనా పట్టుకోవచ్చు సుక్కమ్మ ఆ తెలివితేటలే వుపయోగించింది. "పెద్దోళ్ళు పెళ్ళి సేసారని సిన్నారావుతో కాపరం సేసానుగాని, నామనసంతా నీ మీదే నాయుడు బావా." అంది "స్నేవున్న మొగుడు దొరికితే సేను గట్టు మీదన్నా కాపరం సేసుకుంటాను అంతే గాని, నీఆత్తీ డబ్బూ సూసి పేమించడం లేదు" అంది

ఆ మాటలకి నాయుడు బాబు రెండింత లైపోయాడు.

"కట్టుకున్న పెళ్ళాన్ని కష్ట పెడితే యింటికి యినాశం అని దాంతో కాపరం సేసాను కాని, పెళ్ళి సూపుల్రోజు నుంచీ నా మనసంతా నీమీదేనే సుక్కా' బగ మంతుడు యీ రోజుకైనా ఓ సోటికి చేర్చేడు యిద్దరినీ!" అని సుక్కమ్మని దగ్గరికి తీసుకున్నాడు



అల్లుడొచ్చాక వెంటనే వచ్చేది తేనెజాబిల్లి. (ఆంగ్లంలో హనీమూన్ తెలుగులోకొచ్చేసింది మరి!) జాబిల్లి చల్లదనంలో తేనెలూలికే వలపును పంచుకొంటున్నది 'అల్లుడొచ్చాడు' చిత్రంలోని నాయకుడు రామకృష్ణ, నాయకి జయసుధ. నిర్మాత ఎ. వి. సుబ్బారావు, కె. ప్రత్యగాత్మ దర్శకత్వంలో నిర్మించిన యీ చిత్రం త్వరలో విడుదల.

---

ఆ మర్నాడుదయం అక్క దగ్గరికెళ్ళి తనూ, బావా పెళ్ళి సేసుకుంటున్నామనీ, ఆశీర్దించమని అడిగింది సుక్కమ్మ.

ముందు ఆయమ్మ కర్దం కాక. యేటీ? అంది.

"బావా, నేనూ పెళ్ళి సేసుకుంటున్నాం, ఆసీర్దించు" అంది.

అప్పటిగ్గానీ ఆయమ్మకు తలకెక్క లేదు. ఎక్కగానే, పీటమీంచి లేచింది గుళ్ళో సూకాలమ్మిలా! లేచి సుక్కమ్మ జుత్తట్టుకుని గుంజింది. కాళికాదేవిలా నాలిక సాచి, సెల్లెలిమీద యిరుచుకు పడింది. "సుట్టం సూపుగా కొంపకి సేరి, కొంపకే నిప్పెట్టేత్తావా? సెల్లెలివని సోటిత్తే మొగుణ్ణే ఎత్తుకుపోతావా? నీ గుడ్లు పీకేత్తాను. నీ రకతం తాగేత్తాను." అని సుక్కమ్మ తలని దభీ దభీ మని గోడకేసి కొట్టింది. యింకో దెబ్బ తగిలితే సుక్కమ్మ తల పగిలి పోయేదే కాని, యీలోగా నాయుడు బాబొచ్చి విడిపించేడు.

సెల్లెల్నిడిపించడానికి మొగుడురాగానే ఆయమ్మకి శివమెత్తిపోయింది. తలిరగబోసుకుని మహా మారిలా మొగుడిమీద పడింది సెంద్రమ్మ. ఆయమ్మ కోపం,

అవతారం సూపి పేనాలు తీసేత్తాదని బయపడిపోయాడు నాయుడు బాబు. పాలేళ్ళను పిలిసి పగ్గం తాళ్ళు తెప్పించీడు. సుక్కమ్మా, నాయుడుబాబు కలిసి ఆయమ్మ సేతులూ, కాళ్ళూ కట్టేసి ఓ గదిలో కూర్చోపెట్టేరు.

"ఆ పిశాచానికి తాళ్ళాలాగుతా యేటి? ఆ తాళ్ళు తెంపేసుగుందంటే నిన్నూ, నన్నూ కరకరా నములేద్ది, ఏ రేత్తిరికాడ మీద పడిపోద్దో బయంగా వుంది," అంది సుక్కమ్మ.

ఆ సాయంత్రమే నాయుడుబాబు యినప గొలుసులు తెప్పించేడు. పెళ్ళాం సేతులుకీ, కాళ్ళకీ గొలుసు వేయించీడు.

ఓరం రోజులు తిరక్కుండా సుక్కమ్మను పెళ్ళి సేసుకున్నాడు,

మూడేళ్ళు గడిసేయి కాని, ఆయమ్మకీ కడుపు పండలేదు.

ముందు పెళ్ళామయితే మొగుణ్ణీ, దేవుణ్ణీ నమ్మకుంది కాని, యీయమ్మ మొగుణ్ణీ నమ్మకోలేదు దేవుణ్ణి నమ్మకోలేదు.

అయినా ఓ నలుసూ కలగలేదు.


నాయుడిబాబుకి యిసారం పట్టుకుంది. ఓరసుల్లేకపోతే యీ ఆత్తంతా ఏమై పోవాలి అని బెంగ పడిపోయేడు. "పదారేళ్ళ కుర్రదాన్ని పెళ్ళి సేసుకునుంటే, నాన్నా నాన్నా అని యీ పాలికి ముగ్గురొచ్చీవోరు. ఆత్తి కాసపడి యీ సుక్కమ్మని సేసుకున్నందుకు తగిన శిచ్చే పడింది. నలభైయేళ్ళ దాన్ని సేసుకుంటే పిల్లా పీచూయేటి? నా తెలివంతా యేటయి పోయింది? ఛీఛీ " అని తిట్టుకుని లెంపలేసుకున్నాడు.


నాకు కట్నాలూ ఒద్దు, కానుకలూ ఒద్దు పదారేళ్ళ కుర్రద్దొరికితే సాలన్నాడు నాయుడుబాబు. యీ మాటిని జనం తిర ణాలలాగా ఒచ్చేరు నాకూతుర్ని సేసుకో మంటే, నాకూతుర్ని సేసుకోమని!

నాయుడుబాబు దగ్గిర గుమాత్తా ఒక డుండీవోడు గుర్నాదం అని' ఆ బాబుకి వూరంత ఆశ, గోరెతోకంత జీతమూను! తినడానికి మూడుపూటలూ వుండేది కాదు గాని కూతుర్ని కలెట్టరు కిచ్చి పెళ్ళి చేద్దామని వుండీది ఆ బాబుకి! అంచేత కూతుర్ని బస్తీలో సరివించీవోడు. బస్తీ సోకులు సేయించీవోడు. ఆ గుర్నాదం కూతురే రాధమ్మ.

రాధమ్మకి అయ్య తాహత్తెలుసు!తన్ని కలెట్టరికీ, యింజినీరికీ యిచ్చి పెళ్ళి సేయ లేడని తెల్సు. అంచేత తనతో సదూకొనే 'యేణు' నన్న సేసుకుందా మనుకుంది. అనుకుని పేమించింది. పేమించిందగ్గర్నుంచీ, యేణుబాబును సూడగానే ఆయమ్మకు పమిట నిలిసేది కాదు. యేణు బాబుకీ రాదమ్మన్నా, జారిపోయే పమిటన్నా యిష్టం అంచేత బజారుకి తీసు కెళ్ళీవోడు సినీమాలకు తీసుకెళ్ళీవోడు. కూడా ఒటేళ్ళకు తీసుకెళ్ళేవాడు.

నాయుడు బాబిలా పదారేళ్ళ కుర్ర ద్దొరికితే సాలనేసరికి, గుర్నాదం బుర్ర తిరిగింది. తన కూతురు నాయుడుబాబు కోసమే పుట్టిందనుకున్నాడు. ఆపూట నుంచీ తన జాతకం మారి పోయిందను కున్నాడు. తన కూతురు మహారాణీలా బతుకుద్దని మురిసిపోయేడు. రెండు, మూడే






ళ్ళలో ముసిలాడు కునికేత్తే, ఆత్తి పెత్తనమంతా తనదేనని ఆశపడ్డాడు. యీ శుభవార్త కూతురికి సెప్దామని పరుగు పరుగున యింటి కెళ్ళేడు.

'రాధా', 'రాధా' అని పిలిసేడు.

ఆయమ్మ పలకలేదు.

తలుపు విరిగిపోయేలా గుద్దేడు. ఆయమ్మ పలకలేదు.

లోపలేం సేత్తుందో కిటికీలోంచి సూసీటప్పటికి గుర్నాదం పేనాలు పోయేయి. యింటి దూలానికి చేంతాడు కట్టుకుంది.కురిసీయెక్కి వురేసికుంటోంది

ఆ బాబు తలుపు విరగ్గొట్టి కూతుర్ని కావిలించుకున్నాడు.

రాధమ్మ యెక్కెక్కి యేడ్సింది. "నాబతుకుక్కాలిపోయింది. యేణూ నన్ను సేసుకోను పొమ్మన్నాడు. నాకిప్పుడేటి దారి? వురేసుకోనా? పెద్ద సెరువులో పడి పోనా?" అంది.

"సీ స్సీ ఎదవ మాటలూ నువ్వూను! యేణూ సేసుకోనంటే సచ్చిపోవడమేనేటి? నిన్ను సేసుకోడానికి యేణూకి తాహతుందేటి? మారాణీలా రాజ్జేలేలాల్సిన జాతకం నీది. నువ్వు వూఁ అన్నావంటే లచ్చాధికారికిచ్చి పెళ్ళి సేత్తాను. నలభై లచ్చలాత్తికి పట్టాభిసేకం సేత్తాను." అని కూతురి కళ్ళు తుడిసేడు.

ఆ యమ్మకి ఏడుపింకా ఆగనేదు. "నాకు మూడో నెల నాన్నా. యీ పాపాన్నెలా మోయను?" అని అయ్యను కావిలించుకుంది.


గుర్నాదం నవ్వేడు. "సూసేవా? నలభై లచ్చలనేప్పటికి నేనంటూ ఓరసుడు గూడా ఒచ్చీసేడు. డబ్బు మహత్తిమే అంత!" అన్నాడు.

ఆయమ్మ కర్థంకాక తెల్లమొహం యేసింది.

నాయుడి సంగతంతా యివరంగా సెప్పేడు.

"నేను అరవయ్యేళ్ళ ముసిలోణ్ణి సేసుకోను. స్సీ." అంది రాధమ్మ.

అప్పుడు నాయుడు బాబుకున్న ఆత్తీ, పాత్తీ యివరాలన్నీ సెప్పేడు. సెప్పి "ఆ బాబు బతుకుతాడేటి? గుండెజబ్బుంది. సుగరు జబ్బుంది. పేనాలు తోడీసే వుబ్బసం జబ్బుంది. రెండేళ్ళు గడిసీయంటే గేరంటీగా కునికేత్తాడు. ఆ తర్వాత నీకిట్టమైన కుఱ్ఱాణ్ణి సేసుకుందువుగాని." అన్నాడు.



అప్పుడాయమ్మ మొహం దీపంలా ఎలిగింది. అయ్యా కాళ్ళకి దణ్ణం పెట్టి దీవించమంది.

రాధమ్మను సూడగానే నాయుడు బాబుకి కళ్ళు తిరిగేయి.

''నేను లచ్చిమీదేవిని సూళ్ళేదుగాని, వుంటే రాదలాగే వుండాల" అన్నాడు.

''సీ మహాలచ్చి మొచ్చి పెళ్ళిసేసుకుంటానూ అంటే కాదంటానేటి? ముహూర్తాలెట్టేయండి." అని తొందర సేసేడు.

రాదమ్మకీ, నాయుడుబాబుకీ మూడో పెళ్ళి జరిగింది.

యీ పెళ్ళి సెల్లదంది సుక్కమ్మ. తన కిట్టంలేదు కాబట్టి, నాయుడు బాబుకి పెళ్ళి సేసుకునే హక్కు లేదంది. సేసుకుంటే ఏ కోర్టుకెళ్ళినా తనే నెగ్గుతానంది. నెగ్గకపోతే రాధమ్మనీ, దానికి పుట్టే కొడుకునీ పీక నొక్కేత్తానంది.

ఆ మర్నాడు పోలీసులొచ్చేరు.రాదమ్మ పీక నొక్కేసిందన్న నేరం మీద సుక్కమ్మని జైల్లో యేసేరు పీక నొక్కుతానన్నాను కాని నొక్కలేదు మొర్రోమంది సుక్కమ్మ నొక్కేసీవంది రాధమ్మ. నాయుడుబాబూ, గుర్నాదం బాబూ అవునన్నారు. ఓ డాక్టరు బాబుకూడా సాచ్చికం సెప్పేడు. స                అయిదేళ్ళు జైల్లో వుండమ

పెళ్ళయి అర                ర్కికాలేదు

రాధమ్మకి న                ు

యిదేటి అ                రు.

"నేనెంత                పాయించానో సూద్దామని నా క                దరగా వున్నట్టుంది '' అని ఆస్సెం ఆడేడు నాయుడు బాబు డబ్బున్నవోడు ఆస్సెం ఆడితే వూరంతా నవ్వద్ది ఆ ఆస్సేనికి బందువులంతా నవ్వేరు.


రాదమ్మకి కొడుకు పుట్టేడు


ఆ గొప్పదనమంతా తనదేననుకున్నాడు నాయుడుబాబు. ఆ బాబు సంబరానికి పట్టపగ్గాల్లేవు. ఆకాశమంత పందిరేయించాడు. ఊరంతా భోజనాలెట్టించాడు.

రాధమ్మ నాయుడు బాబును పెళ్ళిచేసుకుందనీ, తనకి కొడుకు పుట్టేడనీ, నలభై లచ్చలాత్తికి ఓరసుడయ్యేడనీ బాబుకి తెలిసింది. తెలీగానే రెక్కలు గట్టుకుని ఒచ్చేసేడు. తన్ని క్షమించమని రాధమ్మ కాళ్ళ మీద పడ్డాడు. నువ్వు లేకుండా నేను బతకలేనన్నాడు

రాదమ్మ ఆలోసించింది ఆలోసించి ఓ సంవత్సరం ఆగమంది.

నాయుడుబాబు ఓరసుల్లేకముందు బెంగెట్టేసుకుని, యిసారంగ కూకుంటే జబ్బు మనిసిలాగుండేవాడు. యీ మునిలాడు ఇవ్వేళో, రేపో కునికేత్తాడురా అనిపించేది. ఓరసుఒొచ్చింతర్వాత ఆ బాబుకి రెండింతలబలం ఒచ్చింది. ముప్పయ్యేళ్ళ యువకుల్లా చకచకా పనిచేత్తా





వుంటే యీ బాబు ఇంకో ఒందేళ్ళు బతికే లాగున్నాడనిపిత్తుంది.

ఓయేడు ఓపిక పట్టింది రాధమ్మ. కొడుకు పెరిగి కేరింతాలు కొట్టీ కొద్దీ యీ ముసిలాడి ఆయుస్సు పెరిగీలా కన్పించింది. యేణు బాబూ బరించలేక పోయీవోడు "యింకా ఎంత కాలం తపస్సు సేయను రాధా'' అని బతిమలాడీవోడు

''నన్నేటి సేయమంటావు యేణూ! నాకేటీ దారి కన్పించడం లేదు. నిన్నెప్పుడు పెళ్ళి చేసుకుందామా, నీ గుండెల మీద ఎప్పుడు ఒలిపోదామా అనిసెంద్రుడి కోసం సెకోరంలా సూత్తున్నాను యీ ముసిలోడు యిప్పట్లో సచ్చేట్టులేడు మన కేటి దారి?'' అని యేడిసింది రాధమ్మ.

ఆడది యేడిత్తే, సేవున్న మగోడూరుకుంటాడా? రాధమ్మ కళ్లు తుడిసీడు. సెంప మీద ముద్దెట్టుకున్నాడు. "నువ్వేటీ ఇసార పడకు. యీ ముసిలాడి పని నేన్చూసు కుంటాను.'' అన్నాడు.

అప్పుడు యేణూ బాబు యేటి సేసీడనుకున్నావ్?

ఓ సక్కని సాయంత్రం—సేలో సింత సెట్టుకింద కూకున్నాడు తళతళ లాడే కత్తి మొల్లో దోపుకుని నాయుడి కోసం కాసీడు.

కూనిరాగా తీసుకుంటూ, ఇరక్కాసిన సేను సూసుకుంటూ బుజంమీద కర్రేసుకుని ఒచ్చీడు నాయుడుబాబు.

''ఓరసుడు బాగున్నాడా తాతా?'' అని పలకరించేడు యేణూ.

నాయుడు బాబుకి యీ కొత్త మొహం యెవరో, తన సేలో కెందుకొచ్చేడో అర్ధం కాలేదు.


"సేను సూసుకోడానికి నేనున్నాను గండా, యింత కట్టబడి యింత దూరం ఎందు కొచ్చేవు తాతా!" అని అడిగేడు యేణూ.

యేణూ మొగం సూడగానే, యిదేదో దొంగ మొకంలా తోచింది నాయుడు బాబుకి.

"ఎవుడువురా నువ్వు నాసేలో కొచ్చీవూ?'' అన్నాడు కోపంగా.

"ఎవుణ్ణా? నీ మూడో పెళ్ళాం రాధ మొదటి మొగుణ్ణి. ఓరసుడికి తండ్రిని. నువు సచ్చిం తర్వాత రాధకి మొగుణ్ణి. నీ ఆస్తికి ఓరసుణ్ణి." అన్నాడు యేణూ యెటకారంగా కవ్వింపుగా.

ఆ మాటలకి నాయుడి కళ్ళు చింత నిప్పుల్లామండేయి "యేట్రా పేలుతున్నావ్!"




అని సెప్పి బుజం మీద కఱ్ఱ తిప్పి యేణూ బుఱ్ఱమీద కొట్టేడు.

ఆ దెబ్బ తగిలితే యేణూ బుఱ్ఱ పది చెక్కలై పోయేది. ఒడుపుగా తప్పించుకున్నాడు. పెద్దపులిలా మీద కెగిరి నాయుడి గుండె మీద తన్నేడు.

నాయుడు వెల్లకిలా పడిపోయేడు.

యేణూ మొల్లోంచి కత్తి దూసి, కసుక్కుమని గుండెల్లో పొడిచేడు. "యాభయ్యేళ్ళు అనుభవించేవు గందా ఈ ఆస్తిని యింక రాధకీ, నాకూ ఒగ్గెయ్" అని కసిగా యింకో రెండు పోట్లు పొడిచేడు——"అని కథ ఆపేడు రంగన్నతాత.

రైలు యేదో స్టేషనులో ఆగింది. అప్పటిదాకా కథ వింటూ కుత కుత వుడికి పోతున్న యెంకటరెడ్డి, చిరాగ్గా పరుగుల్ని చూసినట్లు చూసాడు రంగన్నతాతానీ, కొండయ్యనీ "స్సీ నీతీ జాతీలేని మనుషులు. రారా అప్పలసామీ" అని కోపంగా దిగిపోయి ప్రక్క పెట్టెలోకి మారి పోయేడు.

"యీ బాబు గోత్రం, మా నాయుడి బాబు గోత్రం ఒకలాగేలాగుంది" అనుకుని రంగన్న తాత ఆశ్చర్యంతో నవ్వుకున్నాడు.

వెంకటరెడ్డి లేచి పోగానే, కొండయ్య సంతోషంగా బెంచీ మీద కూర్చున్నాడు. దర్జాగా కాళ్ళు చాపుకుని, సుట్ట అంటించుకున్నాడు.

"అయితే రంగన్నతాతా, నివరికి యేణూ, రాదమ్మ పెళ్ళి సేసుకుని ఆ వూళ్ళోనే వున్నారా?" అన్నాడు వాళ్ళను చూసి తీరాలన్నంత వుత్సాహంగా.

ఆ తెలివి తక్కువ ప్రశ్నకి రంగన్న తాత గయ్యిన లేచాడు కోపంగా "ఏనుగు తలకాయంత తలకాయ వుండగానే సరిగా దొరే! నీమ తలకాయంతైనా తెలివుండాలి' రామాయణం అంతా యిని రాముడికి సీతేమవుద్ది అని [illegible] లా టోడే! డబ్బు మహాత్తిమంతా అరటి పండొలిచి పెట్టినట్టు సెప్తె, యేణూ, రాధా పెళ్ళి సేసుకున్నారా అని అడుగుతావా?

నలభై లచ్చలాత్తికి ఓరసురాలు రాదమ్మ! దమ్మిడీ లేని బికారి యెదవ యేణూని యేం సూసి సేసుకుంటది?

నా మొగుణ్ణి సేలో ఎవరో సంపేసేరని కేసెట్టింది.

పోలీసులొచ్చేరు, యినస్పెట్రు బాబొచ్చేడు.

ఎవరు సంపేరంటే, ఎవరు సంపేరన్నారు.

నాయుడుబాబు పంచాయితీ పెసిడెంటు కాబట్టి, యిట్టంలేని ఎగస్పార్టీ వాళ్ళు పొడిచేసేరని, యినస్పెట్రు బాబు రిపోర్టు యిచ్చేడు.

"స్సీ స్సీ!" అంది రాధమ్మ.

యేణూ పొడిచేసేడంది.

యేణూ తన్ను పేమించేడని. తను

నాయుడు బాబును ప్రేమించి పెళ్ళి చేసుకున్నానని, అంచేత యేణూ ఓర్వలేక తన దేవుడు నాయుడు బాబును పొడిచేసేడని గోలు గోలున యేడ్చింది. యేణూని వురితీస్తేనేగాని మొగుడి మనసుకు శాంతి కలగదంది.

గుర్నాదం అవునన్నాడు.

ఊరంతా అవునంది.

యేణూకి యేడేళ్ళు జైలు పడింది.

ఆ తర్వాత మూణ్ణెళ్ళు తిరక్కుండా, యిల్లూ సేనూ బేరం పెట్టేరు. పెంకుల మిల్లు, సినీమాహాలు అమ్మేసేరు. సగ్గుబియ్యం పేక్టరీ కూడా అమ్మేసేరు. మొత్తం ముప్పయి, నలబై లచ్చలొచ్చేయి ఓ రాత్రి మూటా, ముల్లే సర్దుకుని గుర్నాదం బాబూ, రాదమ్మా మద్రాసు సక్కాపోయేరు'' అని ముగించేడు రంగన్నతాత.

కొండయ్య ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

"ఒరే కొండా, నీకింకా డబ్బు మహత్తిం అర్దం కాకపోతే బెజవాడలో దిగిపోయి సరకార్ ఎక్స్‌ప్రెస్‌లో కూచో; ఆ బండి తిన్నగా మదరాసు ఎల్లిపోద్ది. టికెట్టు కలెక్టరుబాబుకి ఓ రొండ్రూపాయలిచ్చి సేవంటే నువు మదరాసులో దిగిపోవచ్చు. రాదమ్మ కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకో—డబ్బు మహత్తిం యిట్టే అర్ధమయిపోద్ది." అని నవ్వేడు రంగన్న తాత

కొండయ్య మొహం చూస్తే మదరాసు వెళ్ళేలాగే వుంది. ★


అరుణా

# ఆంగ్ల భాషా స్వబోధిని

## అరువది రోజులలో ఆంగ్లభాషను అభ్యసించండి

తెలుగు తెలిసిన వయోజనులు, స్త్రీలు టీచరు సహాయము లేకుండానే ఇంటి వద్దనే వుండి ఇంగ్లీషు నేర్చుకోవడానికి, మా "అరుణా ఆంగ్ల భాషా స్వబోధిని" కల్పతరువు వంటిది. మీ స్నేహితులతో ఇంగ్లీషులో మాట్లాడుకోవడానికి, ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుకోవడానికి, ఇంకెన్నో మీకు కావలసిన విషయాల్ని గురించి ఇందులో బొమ్మలతో సహా చక్కని తేలికైన ఉదాహరణలు వున్నాయి. మీ ఆంగ్ల భాషా విజ్ఞానము నిర్దుష్టంగాను, ధారాళంగాను వుండేందుకు వీలుగా పూర్తి గ్రామరు పొందుపరుచబడివుంది. హైస్కూలు విద్యార్థులకు కూడా ఇది మిక్కిలి ఉపయోగకరమైనది.

త్రివర్ణ ముఖచిత్రముగల జాకెట్‌తో—క్యాలికో బైండు—దాదాపు 700 పేజీలు.

వెల: రూ. **10-00.** పోస్టేజి రూ. **2-75.** నేడే మీ కాపీకి M.O. చేయండి.

**SREE ARUNA BOOK HOUSE (J)**
**1/48, Narayana Mudali St., MADRAS-1**